క్లుప్తంగా

ఇంటివద్దకే వైద్యసేవలు



నకరికల్లు: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స చేయించుకున్న వారి ఇంటివద్దకే వెళ్లి వైద్యసేవలు, సూచనలు అందిస్తామని డాక్టర్ వి.శ్రీనునాయక్ తెలిపారు. మండలంలోని త్రిపురాపురంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వైద్యశిబిరంలో 91 మందిని పరీక్షించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ఓ సామ్రాజ్యం, ఏఎన్ఎం ఎస్.విజయలక్ష్మి, ఆశ కార్యకర్త రమాదేవి, హెల్త్ అసిస్టెంట్ బాలకిశోర్‌నాయక్, హెల్త్ ఎడ్యుకేటర్ లక్ష్మీ భ్రమరాంబ, 104 సిబ్బంది విద్యాసాగర్ పాల్గొన్నారు.

వృద్ధురాలిని కాపాడిన పోలీసులు



అమరావతి: కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం చేసిన వృద్ధురాలిని పోలీసులు కాపాడారు. ఈ ఘటన గురువారం చోసుకుంది. సీఐ బ్రహ్మం తెలిపిన వివరాలు.. వేమల లక్ష్మమ్మది కృష్ణా జిల్లా వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామం. కుటుంబ కలహాలతో కుటుంబ సభ్యులు దాడి చేశారు. మనస్థాపం చెందిన ఆమె అమరావతి వచ్చారు. అమరేశ్వరా స్నానఘాట్‌లో ఆత్మహత్యాయత్నం చేసేందుకు సిద్ధమవుతున్న ఆమెను అక్కడ విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ శ్రీనివాస్ గమనించారు. ఆమెతో మాట్లాడి వివరాలను తెలుసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం బంధువులకు సమాచారం అందించగా రాత్రి లక్ష్మమ్మను సీఐ బ్రహ్మం సమక్షంలో బంధువులకు అప్పగించారు.

వైద్యశాల ఉద్యోగులకు సన్మానం



సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్‌గా పని చేసి ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా బదిలీ అయిన డాక్టర్ ఈటిపోగు వెంకట్రావు, మరో ఇద్దరు ఉద్యోగులను వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం సత్కరించారు. వెంకట్రావుతో పాటు గైనకాలజిస్ట్ శ్రీలక్ష్మి, జనరల్ మెడిసిన్ డాక్టర్ మంజుల అందించిన సేవలను కొనియాడారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఇలాంటి మంచి కార్యక్రమాలు హాస్పిటల్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జరపటం గొప్ప విషయం అని కొనియాడారు.

మాలమహానాడు పట్టణ ఉపాధ్యక్షుడిగా రత్నబాబు



సత్తెనపల్లి: మాలమహానాడు పట్టణ ఉపాధ్యక్షుడుగా పట్టణానికి చెందిన తలమాల రత్నబాబును నియమించారు. మాలమహానాడు సత్తెనపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు గుంటూరు ఆశీర్వాదం అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోదా జాన్‌పాల్ హాజరై రత్నబాబుకు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్లమెంట్ అధ్యక్షుడు కొండ్రు విజయ్, ఉద్యోగ సంఘాల అధ్యక్షుడు మాలే మరియ దాసు, పట్టణ అధ్యక్షుడు కూచిపూడి జాన్ బాబు, వినుకొండ నియోజకవర్గం ఇన్‌చార్జి కీర్తి పాటి వెంకటేశ్వర్లు, నియోజకవర్గం వర్కింగ్ అధ్యక్షుడు గుడిపూడి యేసు రత్నం పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు పురస్కారాలు

నరసరావుపేట రూరల్: లింగంగుంట్ల శంకర భారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో 2022–23 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు శుక్రవారం అందజేశారు. పాఠశాలకు చెందిన గీతాకృష్ణ, ఎస్‌కె హనీషా, ఎం.దాక్షాయణీలు ఉత్తమ మార్కులు సాధించి పాఠశాలస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రభుత్వం నుంచి రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.1000ల నగదు ప్రోత్సాహకంతోపాటు సర్టిఫికెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ పొన్నపాటి విజయ కృష్ణారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు ఎం.పార్వతి, విద్యా కమిటీ చైర్మన్ పి.కాశిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారం



'ఈమె పేరు ఇమ్మడి హరిగోవర్ధన్. భర్త శ్రీనివాసరావు, ముగ్గురు కుమార్తెలు. సత్తెనపల్లి మండలం భృగుబండ గ్రామం. వ్యవసాయ కూలి పనులు చేసుకుంటారు. సొంతిల్లు లేక పోవడంతో గ్రామంలో అద్దె ఇల్లు తీసుకొని నెలకు రూ.1,000 చెల్లించేవారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి స్థలం ఇవ్వడమే కాకుండా ఇల్లు కూడా మంజూరు చేయడంతో నిర్మాణ పనులు చేపట్టారు. సొంతింటి కల నెరవేర్చుతున్న సీఎం వైఎస్ జగన్‌కు, మంత్రి అంబటి రాంబాబుకు జీవితాంతం రుణపడి ఉంటాం'. ఇదీ ఓ లబ్ధిదారు ఆనందం.

– ఇమ్మడి హరిగోవర్ధన్



నా పేరు మద్దిబోయిన అనంతలక్ష్మి. భర్త కోటేశ్వరరావు, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. మాది సత్తెనపల్లి మండలం ధూళ్ళిపాళ్ల గ్రామం. మేము వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసుకుని బతుకుతున్నాం. ఎన్నో ఏళులగా సొంత ఇల్లు లేక అద్దె ఇంటికి రూ.3వేలు చెల్లిస్తున్నాం. వచ్చే సంపాదన కాస్త అద్దెలకే ఖర్చు అయ్యేది. ఇంటి స్థలం కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నా. ప్రభుత్వం స్థలం, ఇల్లు మంజూరు చేసింది. గృహ ప్రవేశం కూడా చేసి ఇక్కడే వాటర్ ప్లాంట్లు పెట్టుకొని జీవిస్తున్నా. ముఖ్యమంత్రి జగనన్న మేలు నా కుటుంబం ఎప్పటికీ మరువదు.

– మద్దిబోయిన అనంతలక్ష్మి

- జగనన్న కాలనీల్లో వేగంగా ఇళ్ల నిర్మాణాలు
- మంత్రి అంబటి రాంబాబు, అధికారుల కృషితో పనులు

సత్తెనపల్లి: సొంత జాగా లేక ఎంతో కాలంగా అద్దె ఇళ్లల్లో కాలం వెళ్లదీస్తున్న పేదలకు రాష్ట్ర ప్రభుత్వం బాసటగా నిలుస్తోంది. వారికి స్థలం ఇవ్వడంతో పాటు ఇల్లు మంజూరు చేసి, కావాల్సిన మెటీరియల్‌తో పాటు సకాలంలో నగదును సమకూరుస్తుండడంతో పేదలు ధైర్యంగా కలల సౌధాన్ని నిర్మించుకుంటున్నారు.

సత్తెనపల్లి మండలంలో నవరత్నాలు–పేదలం దరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా మొత్త 1,739 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసింది. మొత్తం 1,337 మందికి ఇళ్ల ప్లాట్లులు మంజూరు చేసింది. 18 లేఅవుట్లలో 731 మంది లబ్ధిదారులు, సొంత స్థలాల్లో 1,008 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేశారు.

మౌలిక సదుపాయాలు..

జగనన్న కాలనీల్లో లేఅవుట్లు వేసి విద్యుత్ సరఫరా, రోడ్లు, తాగునీరు సదు పాయాలు ముందుగానే కల్పించడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను ఉత్సాహంగా ప్రారంభించారు. ప్రభుత్వం నాణ్యమైన మెటీరియలు సరఫరా చేస్తుండడంతో కాలనీ ల్లో ఇళ్ల నిర్మాణాలు పోటాపోటీగా సాగుతున్నాయి. ఇటు ప్రజాప్రతినిధుల సహకారం, అటు గృహ నిర్మాణ శాఖాధికారుల ప్రోత్సాహంతో గృహ నిర్మాణాలు వేగవంతం అయ్యాయి.

పేదలకు ఆర్థిక చేయూత ...

ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వం అందించే రూ.1.80 లక్షలకు తోడు పేద లబ్ధిదారులకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రత్యేక చొరవ తీసుకుని ఆర్థిక చేయూతను అందించారు. పొదుపు గ్రూపుల్లో సభ్యులుగా ఉన్న లబ్ధిదారులకు రూ.35 వేలు వడ్డీలేని రుణం ఇప్పించడంతో గృహ నిర్మాణాలు వేగవంతం అయ్యాయి. పొదుపు రుణం కాకుండా ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షలు చొప్పున రూ.15,16,42,418 నగదు రూపంలో, రూ. 1,89,24,337 మెటీరియల్ రూపంలో వెరశి రూ.17,17,42,455 ఖర్చు చేసింది.



భృగుబండ గ్రామంలోని లేఅవుట్‌లో పక్కా గృహ నిర్మాణాలు



పూర్తయిన ఇల్లు

సత్తెనపల్లి మండలంలో గృహనిర్మాణాల పురోగతి ఇలా...

గ్రామం	మంజూరు	బీబీఎల్	బీఎల్	ఆర్ఎల్	ఆర్సీ	పూర్తి
అబ్బూరు	92	07	27	14	02	42
భట్లూరు	51	16	23	01	01	10
భీమవరం	141	76	38	03	–	24
భృగుబండ	103	14	15	08	–	66
ధూళ్ళిపాళ్ల	75	03	09	05	11	47
గుడిపూడి	176	49	13	14	02	98
కందులవారిపాలెం	17	–	02	01	02	12
కంకణాలపల్లి	64	34	13	03	04	10
కంటెపూడి	140	36	30	11	09	54
కట్టమూరు	90	20	06	06	08	50
కొమెరపూడి	232	98	23	10	07	94
లక్కరాజుగార్లపాడు	45	10	03	03	–	29
నందిగామ–1	34	04	06	02	02	20
నందిగామ–2	71	25	20	02	03	21
పాకాలపాడు	65	12	13	–	05	355
పెద్దమక్కెన	98	32	14	05	03	44
ఫణిదం–2	147	18	44	03	04	78
రెంటపాళ్ల	98	07	11	03	07	70
మొత్తం	1,739	461	310	94	70	804

సొంతింటి కల నెరవేరింది



నా పేరు కలేకూరి సునీత. నాకు భర్త నాగ మల్లేశ్వరరావు, ఇరువురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మాది సత్తెనపల్లి మండలం కంటెపూడి. నా భర్త డ్రైవర్‌గా పని చేస్తాడు. నేను కూలి పనులకు వెళ్తా. రెక్కల కష్టంతోనే కుటుంబ జీవనం వెళ్ళుతుంది. ఇల్లు లేక మా అత్త, మామల ఇంటిలో ఇరుక్కుని ఉండే వాళ్ళం. ఎప్పటికైనా సొంత ఇల్లు కట్టుకోవాలనేది కల. కానీ వచ్చే సంపాదనతో జీవనం గడవడమే గగనంగా ఉంటుంది. ఇక స్థలం ఎప్పుడు కొనాలి?ఇల్లు ఎప్పుడు నిర్మించాలి? ఇది కలగానే మిగిలిపోతుందేమో అనుకుంటున్న తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్ రెడ్డి పుణ్యమా అంటూ ఇంటి స్థలం, పక్కా ఇల్లు మంజూరు చేయడంతో సొంతింటి కల నెరవేరింది.

– కలేకూరి సునీత

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ

సత్తెనపల్లి: విద్యార్థులు చిన్నతనం నుంచి పట్టుదలతో విద్యనభ్యసించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయాలను నెరవేర్చాలని మండల విద్యాశాఖాధికారి ఎ.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వావిలాలనగర్ పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ శుక్రవారం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యార్థుల భవిష్యత్‌ని దృష్టిలో పెట్టుకొని నాణ్యమైన వస్తువులను విద్యార్థులకు విద్యా కానుకగా అందిస్తున్నారని చెప్పారు. రాజుపాలెం మండల విద్యాశాఖ అధికారి మల్లికార్జున శర్మ మాట్లాడుతూ ప్రతి పాఠశాలకు నాడు– నేడు ద్వారా అన్ని వసతులు కల్పిస్తున్నారన్నారు. 21 మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి వన్నూరు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బెల్లంకొండ నాగ సాయి ప్రసాద్, ఉప సర్పంచి ధనలక్ష్మి, స్వామినాథన్ బాలసుబ్రహ్మణ్యం, అంగన్‌వాడీ కార్యకర్త దమయంతి, యోగేశ్వరి, సీఆర్‌పీ శ్రీకాంత్, డీలర్ రవిచంద్రన్ పాల్గొన్నారు.

నకరికల్లులో..

నకరికల్లు: విద్యతోనే సమగ్రాభివృద్ధి సాధ్యమని ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగం అభివృద్ధికి పెద్దపీట వేశారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీపీ మెయిన్ పాఠశాలలోని విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎం.స్వామి, పీఎంసీ చైర్‌పర్సన్ గజ్జల శకుంతల, వైస్ ఎంపీపీ దూదేకుల హుస్సేన్‌బి బాషా, మాజీ ఎంపీటీసి సభ్యుడు ఆవుల పిచ్చిరెడ్డి, మార్నెళ్ల శ్రీనివాసరావు, పరసా సాంబయ్య, మాజీ సర్పంచి తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, సలీల్ పాల్గొన్నారు.

అచ్చంపేటలో...

అచ్చంపేట: పల్లెల్లో కార్పొరేట్ స్థాయి విద్యనందించే విధంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న విద్యా కానుక కిట్స్ పంపిణీ 90శాతం పూర్తయినట్లు ఎంఈఓ వి.రాజశేఖర్ శుక్రవారం తెలిపారు. స్థానిక జెడ్పీహెచ్ స్కూలులో జగనన్న విద్యా కానుకలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 6,619 మంది విద్యార్థులు చదువుతుండగా. వీరిలో 3,301మంది బాలురు, 3318మంది బాలికలు ఉన్నట్లు చెప్పారు.



జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న ఎంఈఓ శ్రీనివాసరావు తదితరులు



నకరికల్లు మెయిన్ పాఠశాలలో కిట్లను పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రాఘవరెడ్డి

క్రోసూరులో..

క్రోసూరు: క్రోసూరు చెంచుకాలనీలోని ఎంపీపీఎస్(ఎస్టీ) పాఠశాల విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి మల్లా చందమామ, ప్రధానోపాధ్యాయులు జాన్‌పాల్, ఉపాధ్యాయులు బి.ఫిలోమినా, బి.నరసింహారెడ్డి, కె.కోటేశ్వరరావు, గీతాదేవీ పాల్గొన్నారు.

కౌలు రైతులకు పంటసాగు హక్కు పత్రం ఎంతో మేలు

సత్తెనపల్లి: కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రం ఎంతో మేలు అని తహసీల్దార్ ఎస్.సురేష్ నాయక్ అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రచారోద్యమ కరపత్రాలను శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆవిష్కరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ కౌలు రైతుకు భూమిపైన ఎలాంటి హక్కు లేదని, ఆ భూమిపైన పండించే పంటకు మాత్రమే 11 నెలల కాల పరిమితి ఉంటుందని చెప్పారు. ఈ కార్డు ద్వారా కౌలు రైతులకు పంట రుణాలు, రైతు భరోసా, సబ్సిడీ రుణాలను పొందేందుకు వీలు ఉంటుందని వివరించారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ గుంటూరు పల్నాడు జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ కౌలు రైతులు సద్వినియోగం చేసుకొని ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభల్లో రైతులు, కౌలు రైతులు భాగస్వాములై వారి ఒప్పందాల ద్వారా సీసీఆర్సీ కార్డులు పొందాలన్నారు. కార్యక్రమంలో దళిత బహుజన రిసోర్సెంటర్ ప్రతినిధులు మేడే వెంకట రమణ, దావల ప్రేమ్ కుమార్, విప్పర్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు.



పంట సాగుదారుల ప్రచారోద్యమ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ సురేష్‌నాయక్

రాజుపాలెం: ఎస్సీ, ఎస్టీ కౌలు రైతులు కౌలు రైతు కార్డులు పొందాలని డీబీఆర్‌సీ ఏరియా కోఆర్డినేటర్ గడ్డినర్తి కోటిరత్నం సూచించారు. మండలంలోని పెదనెమలిపురిలో కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులపై అవగాహన సమావేశం శుక్రవారం నిర్వహించారు. వీఆర్వో బికారీసాహెబ్ పాల్గొని అవగాహన కల్పించారు.

ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో వైద్య సేవలు

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా సత్తెనపల్లి మండలం గుజ్జర్లపూడి గ్రామంలో ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వి.ప్రదీప్ శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 126 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో జనరల్ ఓపీ 55 మంది, హైపర్ టెన్షన్ 30 మంది, డయాబెటిస్ 30 మంది, గర్భిణులు ఏడుగురు, బాలింతలు నలుగురు ఉన్నారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ నడవలేని వారి గృహాలకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు ఆరోగ్య బోధనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది కె.ధనలక్ష్మి, కె.రోశమ్మ, నరసింహారావు, ఆశ కార్యకర్తలు జి.మౌనిక, డి.సలోమి, వై.సువార్త, డీఈఓ సుధాకర్ ఉన్నారు. అలాగే సత్తెనపల్లి మండలం కంటేపూడిలో డాక్టర్ సాయి తేజ రెడ్డి శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 177 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది జే సంపూర్ణాదేవి, కె.నాని, సారీ తేజస్వి, జి.చిన్నకోటమ్మ, పి.నాగేశ్వరరావు, ఆశ కార్యకర్తలు గీత, మణిమ్మ, డీఈఓ జి.ఇశ్రాయేలు పాల్గొన్నారు.

పలుదేవర్లపాడులో..

పలుదేవర్లపాడు(ముప్పాళ్ళ): మండలంలోని పలుదేవర్లపాడు గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు పి.రమాదేవి పాల్గొని 105 మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఈఓ రవితేజ, సీహెచ్ఓ మధుబాబు, ఎమ్‌పీహెచ్‌ఎస్ మస్తాన్‌రావు, ఏఎన్ఎం రుక్మిణి పాల్గొన్నారు.



కంటెపూడిలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సాయి తేజారెడ్డి

అనుపాలెంలో..

రాజుపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం మండలంలోని అనుపాలెంలో శుక్రవారం వైద్య సేవలు అందించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కేవీ కృష్ణకుమార్ 75 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు.

పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి

జిల్లా మలేరియా అధికారి రవీందర్ రత్నాకర్

సత్తెనపల్లి: నీటి నిల్వలు దోమలకు పుట్టినిల్లు అని పల్నాడు జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్ర రత్నాకర్ అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని 5వ సచివాలయం పరిధిలోని ఫిరోజ్ మందిరం ఏరియాలో ఇంటింటికి పర్యటించి ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రవీందర్ రత్నాకర్ మాట్లాడుతూ ప్రతి ఇంటిలో, ఇంటి బయట పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. దోమల వలన కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ, చికెన్ గునియా, మెదడు వాపు, బోదకాలు తదితర వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. ప్రజలు వీటి వలన అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని సచివాలయ ఆరోగ్య సిబ్బంది, శానిటరీ సిబ్బంది, మలేరియా సిబ్బంది పాల్గొని ఇంటింటికి తిరిగి దోమలు వృద్ధి చెందకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి అన్నారు. మలేరియా నివారణ మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ మలేరియా అధికారి సిహెచ్.ప్రభాకర్ రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్‌లు బి.రోశయ్య, వై.రాజేష్ పాల్, హెల్త్ అసిస్టెంట్ షేక్ హుసేన్, షేక్ షరీఫ్, వార్డ్ శానిటేషన్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీ షేక్ జుబేర పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న పల్నాడు జిల్లా మలేరియా అధికారి రవీందర్ రత్నాకర్ తదితరులు

ఇరుకుపాలెం(ముప్పాళ్ల): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని దోమల నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా అధికారి రవీంద్రరత్నాకర్ చెప్పారు. ఫ్రైడే–డ్రై డేలో భాగంగా మండలంలోని ఇరుకుపాలెం గ్రామాన్ని సందర్శించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. గ్రామంలో ఫాగింగ్ చేయించాలని, మురుగు కాల్వలను శుభ్రం చేయించి దోమల వ్యాప్తి అరికట్టేలా చర్యలు చేపట్టాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వ్యక్తి గృహానికి వంద మీటర్ల వరకూ ప్రతి ఇంటి నుంచి రక్త నమూనాలు సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి ప్రభాకరరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ ఎమ్.జోస్ఫిన్‌రాణి, పీటర్ దానియేల్, పంచాయతీ కార్యదర్శి రోజారాణి, ఏఎన్ఎం శాంతమ్మ పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే సమాజంలో గుర్తింపు

పెదకూరపాడు(అచ్చంపేట): పట్టుదలతో చదివితే సమాజంలో మంచి గుర్తింపు సాధ్యమని హెచ్ఎం అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా మండలంలోని 88 త్యాళ్లూరులోని జిల్లా పరిషత్ హైస్కూలులో 10వ తరగతి పరీక్షలలో ప్రతిభ చూపిన విద్యార్థులను సన్మానించి నగదు బహుమతులు అందజేశారు. పాఠశాలలో మొదటి ర్యాంకు సాధించిన అన్నపురెడ్డి ప్రవీణ్‌కుమార్ రెడ్డికి రూ.3000, గోల్డ్ మెడల్, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. రెండో ర్యాంకు సాధించిన కల్లి ఆకాంక్షకు రూ.2000, సిల్వర్ మెడల్, మూడో ర్యాంకు సాధించిన షేక్ అమీర్‌బాషాకు రూ.1000 నగదు, బ్రాంజ్ మెడల్, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ.శాంతభూలక్ష్మి, ఎస్ఎంసీ చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు శివ పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఉపాధ్యాయులు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నకరికల్లు: విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రూపస్ దానియేల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు. మండలంలోని నకరికల్లు, గుండ్లపల్లి, నర్సింగపాడు, చాగల్లు, చీమలమర్రి, కండ్లకుంట గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమష్టి కృషితో సీఎం వైఎస్ జగన్ సభ విజయవంతం

క్రోసూరు: సమష్టి కృషి వలన సీఎం జగన్ సభ విజయవంతం చేసినట్లు డీఆర్‌డీఏ పల్నాడు జిల్లా పీడీ బాలూనాయక్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రమైన క్రోసూరులోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో పెదకూరపాడు నియోజకవర్గ ఐదు మండలాల వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎంలు, సీసీలు, సిబ్బందితో , ప్రజాప్రతినిధులతో ఆత్మీయ సత్కార సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి క్రోసూరు ఏపీఎం సలీం అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ సభ్యులు జమీలాగఫూర్, ఎంపీడీఓ మహేష్, ఈఓపీఆర్డీ పి.శివరామయ్య, డీపీఎం హనుమాన్ నాయక్, ఏపీఎంలు భరత్‌కుమార్, శివకుమార్, జయరాం, స్త్రీనిధి మేనేజర్ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

మండలంలో 22 మంది ఆణిముత్యాలు ఎంపిక

రాజుపాలెం: మండలంలోని ఏడు పాఠశాలలో ఆణిముత్యాలుగా 22 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈఓ మల్లికార్జునశర్మ శుక్రవారం తెలిపారు. ప్రథమ స్థానం సాధించిన వారికి రూ.3వేలు, ద్వితీయ స్థానం సాధించిన వారికి రూ.2వేలు, తృతీయ స్థానం సాధించిన వారికి రూ.వెయ్యి ప్రభుత్వం తరపున అందజేయనున్నట్లు చెప్పారు. ఒక్కొక్క పాఠశాల నుంచి ముగ్గురుని ఎంపిక చేయగా కస్తురిబా పాఠశాలలో ఇద్దరికి ద్వితీయ మార్కులు సమానంగా వచ్చాయి. అందు వలన 22 మంది ఎంపికైనట్లు తెలిపారు.

బాధితులకు సాయం

అచ్చంపేట: అగ్నిప్రమాద బాధితులకు వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ప్రతినిధులు శుక్రవారం నిత్యావసరాలు, సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, మాజీ సర్పంచి నెల్లూరి చంద్రబాబు, సొసైటీ అధ్యక్షులు రామిశెట్టి రంగయ్య, జిల్లా బీసీ సెల్ కన్వీనర్ సాతర్ల శ్రీనివాసరావు, యార్డు డైరెక్టర్ సీహెచ్ నరసింహారావు, కమల్ సైదా, జాని, సోషల్ మీడియా ప్రతినిధులు అజయ్, సాయి, నాగరాజు పాల్గొన్నారు.

తల్లి, కుమారుడు అదృశ్యంపై ఫిర్యాదు

ముప్పాళ్ల: మండలంలోని మాదల గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌బి, రెండు సంవత్సరాల మహమ్మద్ అమన్ కనిపించటం లేదని భర్త ఇచ్చిన ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ఎస్.కె.ఇమామ్ శుక్రవారం తెలిపారు. గ్రామంలోని ముస్లిం కాలనీకి చెందిన షేక్ మస్తాన్‌బి గత నెల 30వ తేదీన కూలీ పనులకు వెళ్లి వచ్చేసరికి కనిపించకుండా పోయారు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్ళలోను వెతికినప్పటికీ ఆచూకి లభించకపోవటంతో భర్త గుడిపాటినాగులు పోలీసులను ఆశ్రయించారు. భర్త షేక్ గుడిపాటి నాగులు ఫిర్యాదు మేర కేసు నమోదు చేశారు.

వేధింపులపై కేసు

ముప్పాళ్ల: కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్నారంటూ వివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ నరసింహారావు శుక్రవారం తెలిపారు. మండలంలోని లంకెలకూరపాడు గ్రామానికి చెందిన నిండుజర్ల ఆమనికి క్రోసూరు మండలం దొడ్లేరు గ్రామానికి చెందిన అశోక్‌తో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. అప్పటి నుంచి అధిక కట్నం కోసం భర్తతో కలసి అత్త, మామ, ఆడపడుచు, ఆడపడుచు భర్త వేధింపులకు గురి చేస్తున్నారంటూ ఆమని పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన బిడ్డ బాగోగులు కూడా పట్టించుకోవటం లేదని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. పైగా తనతో కాపురం చేయకుండా చెప్పకుండా మే నెలలో సౌదీ వెళ్లాడని, తనను మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరుతూ ముప్పాళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమని ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

దిశ యాప్‌పై అవగాహన



అమరావతి: దిశ యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని సీఐ బ్రహ్మం సూచించారు. దిశ యాప్‌పై శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అమరావతి బస్టాండ్ సెంటర్ నుంచి నాలుగురోడ్ల కూడళ్లలో విద్యార్థులకు, యువకులకు, వృద్ధులకు, మహిళలకు దిశ యాప్ అవసరాన్ని వివరించి వారి ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేయించారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగేంద్ర పాల్గొన్నారు.